ప్యాచ్ వర్కులతో సరి!

- రోడ్ల నిర్మాణాలకు నిధుల విడుదలలో జాప్యం
- గోతులు పూడ్చి సరిపెడుతున్న అధికారులు


వడ్లపూడి రోడ్‌లో ఎక్కడ చూసినా ఇలాంటి ప్యాచ్‌లే


ప్యాచ్ వర్క్ చేసిన తర్వాత వడ్లపూడి ప్రధాన రహదారిలో తేలిన రాళ్లు

గాజువాక: గాజువాకలోని పలు ప్రధాన రహదారుల్లో ప్రయాణం నరకంగా మారుతోంది. చిన్నపాటి వర్షం వస్తే ఎక్కడ రోడ్డు బాగుందో, ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితుల్లో వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు వ్యక్తమవుతుండడంతో అధికారులు గోతులు పూడ్చి సరిపెడుతున్నారు. జోన్‌లోని పలు వార్డుల్లో రోడ్లను పునర్నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేసినా 15వ ఆర్థిక సంఘం నిధులు జారీ చేయడంలో జాప్యం చోటు చేసుకుంది. దీంతో అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపేసుకొంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల 87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారి సహా, 70, 73, 76, 88వ వార్డుల్లోని పలు రోడ్లకు ప్యాచ్ వర్కులతో సరిపెట్టారు.

మోక్షమేది 'మహా'శయా!

గాజువాకలోని వివిధ రోడ్లకు దశాబ్ద కాలంగా మోక్షం కలగడంలేదు. గత ప్రభుత్వంలో పలు రోడ్లను పునర్నిర్మించినప్పటికీ ఇంకా చాలా రోడ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంది. కణితి రోడ్ విస్తరణ పూర్తిస్థాయిలో జరగలేదు. వంటిల్లు జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్ వరకు రూ.3 కోట్లతో విస్తరించాల్సి ఉన్నప్పటికీ నిధులు ఇంకా మంజూరు కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. దీనిపై వినతులు వెల్లువెత్తడంతో అక్కడక్కడా గోతులు పూడ్చారు.

వడ్లపూడి ప్రధాన రహదారిదీ అదే పరిస్థితి. ఈ రోడ్డులో గోతులు పూడ్చడం తప్పా నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టలేకపోతున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.6 కోట్లు మంజూరైనప్పటికీ స్థానిక అధికారులు వాటిని విడుదల చేయకపోవడడంతో నిర్మాణం పెండింగ్‌లో పడిపోయింది. దీంతో అధికారులు గోతులు పూడ్చి చేతులు దులుపుకున్నారు. ఈ రోడ్‌లో భారీ వాహనాలుతిరుగుతుండటంతో గోతులు పూడ్చినా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు పేర్కొంటున్నారు. గాజువాకలో వివిధ రోడ్ల పరిస్థితి ఇలాగే మిగిలిపోయిందని వాపోతున్నారు.


జాతీయ రహదారిపై ఇలా..

జాతీయ రహదారిపై తలోమాట

లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి మొత్తం శిథిలావస్థకు గురైన విషయం తెలిసిందే. అయితే ఈ రోడ్ నిర్వహణ బాధ్యతను ఎన్‌హెచ్‌ఏఐ చూసుకుంటుందని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. రోడ్‌పై గోతులు కూడా ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలోనే పూడ్చుతున్నారని చెబుతున్నారు. కాగా, ఈ రోడ్‌ను ఎన్‌హెచ్‌ఏఐ నుంచి డీనోటిఫై చేశారని, ఇది జీవీఎంసీ మెయిన్ రోడ్‌గా పిలవాలని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పునర్నిర్మాణానికి నోచుకోని పరిస్థితి తలెత్తింది.

త్వరలోనే నిధులు

గాజువాకలో నాలుగైదు రోడ్లను పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాల్సి ఉంది. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. అప్పుడు నూతన రోడ్లు వేస్తాం. స్థానికులు ఇబ్బంది పడకుండా ప్రస్తుతం ప్యాచ్ వర్కులు చేపట్టాం. ఆ పనులు కూడా వారం పది రోజుల్లో పూర్తవుతాయి.

-ఎం.ఆర్.ఎస్.అప్పారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజువాక జోన్

క్లుప్తంగా

ఘనంగా పిల్లేలమ్మ జాతర


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: నాగుల చవితిని పురస్కరించుకొని 79వ వార్డు పాత అగనంపూడి కొండపై వెలిసిన పిల్లేలమ్మ, నాగ దేవత, సుబ్రహ్మణ్య స్వామి దేవతామూర్తులకు ఘనంగా పూజలు చేశారు. గ్రామంలోని వందలాది మంది భక్తులు కొండపైకి చేరుకొని పసుపు, కుంకుమలు, చీర సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బొబ్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు కుటుంబ సభ్యులతో కలిసి లలిత, విష్ణు సహస్ర నామాల పారాయణం చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత


అర్చకుల సమక్షంలో విరాళం అందజేస్తున్న భక్తుడు


అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి మంగళవారం ఎస్‌ఏడీ కొత్తరోడ్డుకు చెందిన భక్తుడు వివేక్ నారాయణ ఆలయ విరాళం ఇచ్చారు. ఆయన కుటుంబ సమేతంగా రూ.14000 చెక్కును దివ్యక్షేత్రం ట్రస్ట్ బోర్డు మెంబర్లకు అందజేశారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు


గౌరీ పరమేశ్వర్యులకు పూజలు చేస్తున్న సౌత్ ట్రాఫిక్ సీఐ వెంకట్రావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ అట్టవానిపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు మంగళవారం గౌరమ్మ సంబరాలతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా సౌత్ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సీఐ వెంకటరావు, స్నేక్ కాచర్ కిరణ్‌లను ఉత్సవ కమిటీలు ఘనంగా సత్కరించారు. ఉత్సవమూర్తులను అట్టహాసంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు జాజుల సూరిబాబు, తాతారావు, ఈశ్వరరావు, చందు రమేష్, శ్రీనివాసరావు, ప్రకాష్, త్రిమూర్తులు, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

యునాని వైద్య విధానంపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో ఆశ వర్కర్లు, వైద్యులు

పెదగంట్యాడ: ప్రాంతీయ ఆయుష్ మిషన్ ప్రవేశపెట్టిన యునాని వైద్య విధానంపై ఆశ వర్కర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ప్రతిభ అవగాహన కల్పించారు. బీపీ, సుగర్‌తో పాటు స్త్రీల ఆరోగ్య సమస్యల గురించి వివరించారు.

- 77వ వార్డు పరిధిలోని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ వర్కర్లకు వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ప్రతిభ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎఫ్ రవీంద్ర, కె.అన్నపూర్ణ, ఎం.శ్రీనివాసరావు, తనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అల్లుకున్న నిర్లక్ష్యం

అగనంపూడి: రాజీవ్‌నగర్ కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్, వీఎస్ఈజెడ్‌కు అనుసంధానం చేసే వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాలు, లైట్ల స్టాండ్‌లకు పాదలు అల్లుకున్నాయి. ఈ ప్రాంతంలో నిర్వహణ బాధ్యతను వీఎస్ఈజెడ్ చేపడుతోంది. ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల స్తంభాలకు దట్టంగా పాదలు అల్లుకుంటున్నాయి. అధికారులు స్పందించి వెంటనే పాదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


దువ్వాడ వీఎస్ఈజెడ్ ఫ్లైఓవర్ వంతెనపై విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పాదలు

అబ్బురపరిచిన మాక్ డ్రిల్


విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి


సునామీపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెదగంట్యాడ: ఎప్పుడు ప్రశాంతంగా ఉండే యారాడ గ్రామంలో మంగళవారం అలజడి రేగింది. పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది చేరుకోవడంతో ఏమి జరుగుతుందో అని గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. సమావేశం ఉంది అందరూ రావాలని అధికారులు చెప్పడంతో అందరూ భయాందోళనకు లోనయ్యారు. మరో పక్క అగ్నిమాపక దళ అధికారులు ఎయిర్ బోట్, లైఫ్ జాకెట్స్ తీసుకు రావడంతో గ్రామస్తులకు ఏమీ అర్థం కాక అయోమయంలో పడ్డారు. అంతా వచ్చిన తర్వాత అసలు విషయం చల్లగా చెప్పారు రెవెన్యూ అధికారులు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలో అనే అంశం పై అవగాహన కల్పించడానికి వచ్చామని చెప్పారు. విపత్తు నిర్వహణ అథారిటీ (ఏ పీ ఎస్ డీ ఎం ఏ) మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి నేతృత్వంలో అటు పోలీసు శాఖ, ఇటు అగ్నిమాపక దళం,విద్యుత్ శాఖ, వైద్య శాఖాధికారులు విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు..అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ తుపాన్లు, సునామీ వంటివి వచ్చే ముందు వాతావరణ శాఖ అధికారులు ముందుగానే సమాచారం ఇస్తారన్నారు. విపత్తుల సమయంలో ఎవరూ భయపడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల బారి నుంచి ఎలా రక్షించుకోవాలో వివరించారు. గ్యాస్ లీక్ అయితే భయపడకుండా ఇంట్లోని అన్ని కిటికీలు తెరచి ఉంచాలని..కరెంట్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని చెప్పారు. స్వయంగా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ప్రమాదం నుంచి బయట పడాలో వారి వద్ద ఉండే తాళ్లు, పాత ట్యూబ్‌లో ఖాళీ వాటర్స్ బాగీల్స్ ఉపయోగించి ఎలా రక్షించుకోవాలో వివరించారు.

కూటమి ప్రభుత్వం ఉక్కును ఆదుకోవాలి


మాట్లాడుతున్న రామచంద్రరావు

అగనంపూడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కూటమి ప్రభుత్వం కాపాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. 1363వ రోజు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని వాగ్దానాలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకపోవడం తగదన్నారు. వేల కోట్ల రాయితీలు, స్థలాలిచ్చి ఏకొద్ది మందికో ఉపాధి కల్పించే సంస్థల ఏర్పాటుకు చేయూతిస్తున్నాయని, కర్మాగారాన్ని బడాబాబులకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. కూటమి నాయకులు స్పందించి విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించేలా చొరవ తీసుకొని వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రమణ, రమణమూర్తి, సుబ్బయ్య, కోరాడ వెంకటరావు, దాసరి శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్-2 ఇంటక్ నాయకలు పాల్గొన్నారు.

నాగన్నా.. చల్లగ చూడన్నా..

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు


పూజలందుకున్న నాగదేవత కొండపైనున్న అమ్మవారు


కొండపై పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



నాగదేవత కొండపై పాలుపోయడానికి క్యూలైన్లలో నిల్చున్న భక్తులు


గాజువాక సబ్‌స్టేషన్ వద్ద పుట్టలో పాలుపోస్తున్న భక్తులు


ఉక్కు త్రిశక్తి ఆలయంలో నవనాగ శక్తికి పూజలు చేస్తున్న భక్తులు


సీతానగరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గాజువాక: నాగుల చవితి పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. పుట్టల్లో గుడ్లు వేసి, మరికొంతమంది పుట్టలవద్ద చీరలను సమర్పించి సుబ్రహ్మణ్య స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. చవితి ఉత్సవాన్ని పురస్కరించుకొని ముందురోజే గాజువాకలోని పలు ప్రాంతాల్లో నివాసులు పుట్టలను సిద్ధం చేశారు. పాలుపోసిన అనంతరం పలువురు కోళ్లను బలిచ్చారు. గాజువాకలోని కణితి రోడ్డు, బీసీ రోడ్డు, చినగంట్యాడ, వడ్లపూడి, గంగవరం పోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో పుట్టలవద్ద భక్తులతో కోలాహలం నెలకొంది.

అగనంపూడి: నాగుల చవితిని పురస్కరించుకొని వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆచార, సంప్రదాయాల ప్రకారం పట్టుచీరలు, పంచె, లాచ్చీలు ధరించి పుట్టల్లో పాలు, గుడ్లు వేసి భక్తిని చాటుకున్నారు.

- 88వ వార్డు దువ్వాడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న నాగదేవత కొండకు భక్తల తాకిడి పెరిగింది. ఉదయం ఏడు గంటల నుంచి పుట్టల్లో పాలుపోయడానికి వేలాదిగా తరలి వచ్చారు. ఆలయ కమిటీ భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.
- అగనంపూడి, ఫార్మాసిటీ కాలనీ, వడ్లపూడి, కణితి, కూర్మన్నపాలెం, దువ్వాడ, లంకెలపాలెం ప్రాంతాల్లో వేలాది మంది భక్తులు నాగదేవతకు చిమ్మిలి ప్రసాదంగా సమర్పించారు.

ఉక్కునగరం: ఉక్కునగరంలో మంగళవారం నాగులచవితి పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కాలభైరవ స్వామి ఆలయంలోని పుట్టలో చాలా మంది భక్తులు పాలు పోశారు. ఆలయంలోని నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉక్కునగరంలో పుట్టలు,ఖాళీ ప్రదేశం అధికంగా ఉండడంతో గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి, ఉక్కునగరానికి చెందిన భక్తులు విచ్చేసి తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి పుట్టలో పాలు, గుడ్లు పోసి నాగేంద్రునికి పూజలు చేశారు.

నవనాగశక్తి పుట్టకు భక్తుల తాకిడి

రాష్ట్రంలోనే అతి అరుదైన ఆలయంగా ఖ్యాతిగాంచిన ఉక్కునగరం త్రిశక్తి ఆలయ ఆవరణలో ఉన్న నవనాగశక్తి పుట్ట వద్ద ఉన్న తొమ్మిది ప్రత్యేక నాగులకు పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆ పుట్టల్లో పాలు, గుడ్లు పోశారు. ఆలయ అర్చకుడు ఫణిశర్మ నేతత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెదగంట్యాడ: నాగుల చవితి అంటేనే నాగదేవతలను ఆరాదించే నాగుల చవితి పర్వదినాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే జనం పుట్టల వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లారు. నాగేంద్రునికి విశేష పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్లు, నువ్వులతో తయారు చేసిన చిమిడీ వేశారు. మండలంలోని నడుపూరు, సీతానగరం, నెల్లిముక్కు, దల్లివానిపాలెం, సిద్ధేశ్వరం, దయాల్‌నగర్, ఇస్లాంపేట, పాలవలస తదితర ప్రాంతాల్లో పండగ సందడి కనిపించింది. పుట్ట వద్ద పిల్లలు ఆటపాటలతో గడిపారు. బాణసంచా కాల్చారు.

సహజ సిద్ధం.. ప్రకృతి వరం

- ధారకొండ.. భక్తిభావమే మది నిండా!
- శివలింగంపై జాలు వారుతున్న గంగమ్మ
- వన సమారాధనలకు అనువైన ప్రదేశం


కనువిందు చేసే ధారకొండ అందాలు


శివలింగంపై పడుతున్న ధార

పెదగంట్యాడ: ప్రకృతి గీసిన చిత్రాలెన్నో.. అందులో అద్భుతాలు మరెన్నో.. ఆస్వాదించాలనే మనసుండాలే గానీ వీచే గాలి కూడా అద్భుతమే.. కొండలు.. వాటి మధ్య నుంచి జాలువారే జలపాతాలు.. సెలయేర్లు.. నదులు ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నెన్నో అందాలు.. అటువంటి ప్రదేశం మండలంలోని గంగవరం గ్రామానికి ఆనుకొని ఉంది. అయితే ఇక్కడ ప్రకృతి అందాలతో అక్కడ కొలువుదీరిన శివలింగం.. దానిపై నుంచి జాలువారుతున్న గంగమ్మను చూస్తే ఎవరైనా మైమరచి పోవాల్సిందే.. భక్తి భావంతో పులకించిపోవాల్సిందే.. చుట్టూ ఎత్తైన కొండలు.. ఎటువైపు చూసినా పరుచుకున్న పచ్చదనం.. కొండల మధ్య నుంచి.. పచ్చని చెట్లను తాకుతూ సన్నగా.. జల జల జారుతూ.. గల గల పారుతూ వస్తోంది ఓ ధార.. అది ఎక్కడి నుంచి వస్తుందో.. ఎక్కడ పుట్టిందో.. దాని జన్మ స్థలమెక్కడుందోనని.. దాని రహస్యాన్ని తెలుసుకుందామని.. చేయని ప్రయత్నం లేదు.. దాని గురించి ఆలోచించని బుర్రలేదంటే అతిశయోక్తి కాదేమో.. శివుని ఆజ్ఞతో.. గంగాదేవి జాలు వారుతూ వస్తూ.. అక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన శివలింగంపై నుంచి జారుతోంది.. చూపరులను ఇట్టే ఆకర్షిస్తోంది.. మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా చేస్తోంది.. మండు వేసవిలో సైతం అదేవిధంగా ధారగా రావడం విశేషం.. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని గంగవరం గ్రామానికి ఆనుకొని.. యారాడ వెళ్లే ప్రధాన రహదారి పక్కన.. భార్గవ్ ఆర్ట్స్ స్టూడియో లోపల ఉంది ఈధార కొండ.

కోర్కెలు తీర్చే ధారస్వామి

40 ఏళ్ల కిందట ఇక్కడ ధారస్వామి కొండ సహజ సిద్ధంగా ఏర్పడిందని... స్వామి వారిని దర్శించి పూజలు చేసిన తర్వాత కోర్కెలు కోరుకుంటే అవి వెంటనే నెరవేరుతాయని ఇక్కడి వారు చెబుతున్నారు. పెళ్లి కాని వారు వచ్చి వివాహం కావడం లేదని స్వామితో చెప్పుకుంటే వెంటనే వారికి పెళ్లవుతుందని, అలాగే సంతానం లేని వారు కూడా స్వామి వద్దకు వచ్చి మొక్కుకుంటే.. పండంటి పిల్లలు పుడతారని అంటున్నారు. కోర్కెలు నెరవేరిన వెంటనే వచ్చి ఇక్కడ స్వామి వారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది..


ధార స్వామికి పూజలు చేస్తున్న పల్లేటి గురయ్య,పల్లేటి రాజమ్మ

ప్రతి శనివారం భక్తుల కోలాహలం

ధారకొండకు సాధారణ రోజుల్లో ప్రతి శనివారం భక్తులు పోటెత్తుతారు. కార్తీక మాసం సమయంలో ఆ ప్రాంతం భక్తజనంతో కోలాహలంగా ఉంటుంది. ఈ ప్రాంతం విశిష్టత తెలుసుకున్న వారు కూడా అక్కడి శివలింగాన్ని, ధారస్వామిని దర్శించకుంటున్నారు. గంగవరం గ్రామానికి చెందిన వారు తమ తమ కుటుంబ సభ్యులతో ఇక్కడకు పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అలాగే ధారస్వామికి ఇష్టమైన అన్ని రకాల కూరగాయలతో కలగూర అక్కడే తయారు చేస్తారు. అన్నం, పప్పుతో కలిపి పులగం వండి వారుస్తారు. దానినే స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి.. ఆపై కుటుంబ సభ్యులంతా ఆరగిస్తారు.. అక్కడే రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపి తమ కోర్కెలు తీర్చాలంటూ స్వామి వారిని మనస్ఫూర్తిగా వేడుకుంటారు.

ఎంతో మహిమ గల స్వామి

ధార స్వామి ఎంతో మహిమగలవారు.. భక్తులు స్వామిని దర్శించుకుని.. కోర్కెలు కోరుకుంటే చాలు.. వాటిని ఇట్టే తీర్చేస్తాడు.. 40ఏళ్లుగా స్వామి సేవలో తరిస్తున్నాను. భక్తులకు నా వంతు సేవ చేస్తున్నాను. ప్రతి శనివారం ఇక్కడ పూజలు చేస్తున్నాను.ఇక్కడ స్వామి వారు వెలసిన నాటి నుంచి పూజలు చేస్తున్నాం. ఏ కష్టం వచ్చినా ధార స్వామినే నమ్ముకుని ఉన్నాం. ఆయనే అన్ని సమస్యలకు దారి చూపిస్తున్నారు.

-పల్లేటి గురయ్య, పల్లేటి రాజమ్మ గంగవరం

భెల్ టౌన్‌షిప్‌లో సందడి


భక్తులతో నిండిపోయిన భెల్ టౌన్ షిప్

అక్కిరెడ్డిపాలెం: నాగులచవితి సందర్భంగా భక్తులతో భెల్‌టౌన్‌షిప్‌లో సందడి నెలకొంది. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, మింది, రాంనగర్, గుడివాడఅప్పన్నకాలనీ, గాజువాక, రాజీవ్‌నగర్, గిరిప్రసాద్‌నగర్‌కాలనీ, బొజ్జన్నకొండ తదితర ప్రాంతాల నుంచి భెల్ టౌన్ షిప్‌కు భక్తులు తరలివచ్చారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు భారీగా రావడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది.